క్లుప్తంగా

పట్టపగలే వెలుగులు



జనగామ: పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. హైమాస్ట్ లైట్ల టైమింగ్ సెన్సార్‌పై అధికారుల నిర్లక్ష్యంతో కరెంట్ ఖర్చు వృథా అవుతోంది. పట్టణంలో అనేక వార్డుల్లో వీధి దీపాల నిర్వహణ అధ్వానంగా మారగా.. ప్రజలు చిమ్మ చీకట్లో మగ్గి పోతుంటే... ఉన్న చోట పట్టపగలే వెలగడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సాంస్కృతిక సంబురాలు



స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెం గ్రామంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రజానాట్య మండలి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అట్టహాసంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతీ ఏడాది మాదిరిగానే గ్రామంలోని ప్రధాన కూడలిలో ప్రజానాట్యమండలి కళాకారులు, యువత, మహిళలు, విద్యార్థులు, చిన్నారులు పెద్ద ఎత్తున కోలాటాలు, నృత్యాలు, గొల్లకురుమల డప్పు వాయిద్యాలను ఘనంగా చేపట్టారు. ఎలాంటి గొడవలు జరగకుండా సీఐ జి.వేణు ఆదేశాల మేరకు పోలీసులు తగిన బందోబస్తు నిర్వహించారు. నాయకులు, కళాకారులు పాల్గొన్నారు.

గోవిందరాజులస్వామి కల్యాణోత్సవం

దేవరుప్పుల: కోలుకొండలోని గుట్టపై సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని గోవింద రాజుల స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి ప్రతిరూపంగా కొలిచే గోవిందరాజులస్వామి కల్యాణోత్సవంలో వేదపండితులు కృష్ణామాచార్యుల ఆధ్వర్యంలో తలంబ్రాలు పోశారు. ప్రకృతి రమణీయంగా ఉండే గుట్టపై భక్తులు ఎక్కి తమ మొక్కులు చెల్లించుకున్నారు. రవి, కిరణ్, రమేష్, సత్యనారాయణ, రమేశ్ జీన్నారు.

ఎడ్లబండ్ల ఊరేగింపు

తరిగొప్పుల: మండలకేంద్రంతో పాటు నర్సాపూర్ గ్రామంలో ఎడ్ల బండ్ల ఊరేగింపు అట్టహాసంగా సాగింది. మండలకేంద్రంలో ఎడ్లబండ్ల ఊరేగింపులో అపశ్రుతి చోటుచేసుకుంది. ఊరేగింపులో పాల్గొన్న ఎడ్లబండి ఒకటి డప్పుచప్పుళ్లు కొడుతున్న వారిపైకి దూసుకెళ్లింది. దీంతో ఎనమల్ల ప్రవీణ్, ఎర్రవెల్లి రాజయ్య, చింతల సంజీవులు, చింతల మల్లయ్యకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గాయపడిన వారికి స్థానికంగా ప్రథమ చికిత్స అందించారు.

17న వినియోగదారుల సదస్సు

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో ఈ నెల 17వ తేదీన ఉదయం 10.30 గంటలకు విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నట్లు విద్యుత్ ఏఈ విశ్వసాయితి తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. విద్యుత్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం వినియోగదారులు హాజరుకావాలన్నారు. ఇంటి కరెంట్ మీటర్ కేటగిరి మార్పు, సర్వీస్ రద్దు, మీటర్లు మార్చడం, ఓల్టేజి హెచ్చు తగ్గులు, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం వంటి తదితర సమస్యలపై దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.సదస్సుకు వినియోగదారుల ఫోరం చైర్ పర్సన్ వేణుగోపాలచారితో పాటు డీఈ వై.రాంబాబు, ఏడీ రణదీర్‌రెడ్డి తదితర అధికారులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఎన్నిక

లింగాలఘణపురం: మండలంలోని కళ్లెం అంబేడ్కర్ యువజన సంఘం నూతన అధ్యక్షుడిగా మబ్బు పరశురాములు ఎన్నికయ్యారు. బుధవారం మబ్బు కనకయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్న నూతన కమిటీలో ఉపాధ్యక్షుడిగా అశోక్, ప్రధాన కార్యదర్శిగా అశోక్, కోశాధికారిగా ప్రసాద్‌లతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: కొడవటూర్ గ్రామంలో బందారం చిరంజీవి ఇటీవల మృతి చెందాడు. కాగా, బుధవారం బాధిత కుటుంబ సభ్యులను మాజీ సర్పంచ్ గంగం సతీష్‌రెడ్డి పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కనుకయ్య, కనకాచారి, రాజమల్లయ్య, అయిలయ్య, గణేష్, సుమన్, నాగరాజు ఉన్నారు.

జంతువు దాడిలో 17 గొర్రెలు మృత్యువాత

తరిగొప్పుల: గుర్తుతెలియన జంతువు దాడిలో 17 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. స్థానికుల కథనం ప్రకారం.. మండలకేంద్రం బేడబుడగ జంగాల కాలనీకి చెందిన చెన్నూరి రమేశ్‌కు చెందిన మేకల పాకపై మంగళవారం రాత్రి గుర్తుతెలియన జంతువు దాడిచేసింది. ఈ ఘటనలో 10 గొర్రెలు, 7 గొర్రె పిల్లలు మృత్యువాత పడ్డాయి. రూ. 3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ దాడి హైనా చేసినట్లు తెలుస్తోందని రమేశ్ అనుమానం వ్యక్తం చేశాడు.

కమ్ముకున్న పొగమంచు



చలి తీవ్రత పెరుగుతుండడంతో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఉదయం 10 గంటలు దాటినా పొగమంచు వీడడం లేదు. ఆకాశం నుంచి కురుస్తున్న మంచు జల్లులతో ప్రజలు ఎంజాయ్ చేస్తుంటే.. వాహనచోదకులకు కష్టాలు తప్పడం లేదు. మంచుతో వరంగల్ –హైదరాబాద్ నేషనల్ హైవే ఉన్న యశ్వంతాపూర్, పెంబర్తి తదితర గ్రామాలు ఉదయం 10 గంటల వరకు కనిపించే పరిస్థితి లేదు. వాహనాలు హెడ్ లైట్లు వేసుకున్నా దగ్గరకు వచ్చే వరకు కనిపించక పోవడంతో వేగం తగ్గించి ప్రయాణం చేస్తున్నారు.

–జనగామ

పొదుపుతో భవిష్యత్‌కు భరోసా

- ఒక్కో సభ్యుడికి రూ 2.50 లక్షల రుణం
- ఆదర్శంగా నిలుస్తున్న ఇబ్రహీంపూర్ ఆరె క్షత్రియ సంఘం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆరె కులస్తులు

రఘునాథపల్లి: మండలంలోని ఇబ్రహీంపూర్ ఆరె కులస్తులు ఐకమత్యంతో రెండున్నర దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసుకున్న శ్రీ శివాజీ ఆరె క్షత్రియ సహకార పొదుపు సంఘం ఆదర్శంగా నిలుస్తోంది. నెలకోసారి కలుసుకోవాలని, సమస్యలు కలిసికట్టుగా పరిష్కరించుకోవాలనే ఉద్దేశంతో 2000 జనవరి 15న మూకుమ్మడిగా కులస్తులు పొదుపు సంఘం ఏర్పాటు చేసుకున్నారు. 25 ఏళ్ల నుంచి ప్రతీ నెల 15వ తేదీన సభ్యులు సమావేశమవుతూ వాటాధనం, తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లిస్తూ, సహకార సంఘం నిర్వహిస్తున్నారు. 32 మంది సభ్యుల్లో ఏ సభ్యుడికైనా ఆపద వస్తే కలిసికట్టుగా ఉంటారు. ప్రారంభంలో నెలకు రూ.220 ఉన్న వాటాధనం కొన్నాళ్ల తరువాత రూ.500కు పెంచారు. సంఘంలో ఇప్పటి వరకు రూ 41.82 లక్షలు పొదుపు చేసుకున్నారు. ఒక్కో సభ్యుడు తన అవసరానికి రూ.2 లక్షల చొప్పున అప్పుతో పాటు, రూ.50 వేల పంట రుణం పొందుతున్నారు. తీసుకున్న రుణం 36 నెలల్లో తిరిగి చెల్లిస్తూ మళ్లీ రుణం పొందుతున్నారు. ఆదివారం జరిగిన వార్షిక సమావేశంలో కులస్తులందరూ సమావేశమై నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. ఆపద సమయంలో పొదుపు సంఘంతో ఎన్నో అవసరాలు తీరాయని పలువురు సభ్యులు ప్రసంగించారు. అలాగే ప్రతి సభ్యుడికి పొదుపు సంఘం ద్వారా అరతులం బంగారం, వాటాధనం రూ.500 నుంచి రూ 800 వాటాదనం పెంపు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, పుణ్యక్షేత్రాల టూర్, ఏటా శివాజీజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. ఈ సందర్భంగా శ్రీ శివాజీ ఆరె క్షత్రియ సహకార పొదుపు సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గాజులపాటి మైసారావు, మోర్తాల మహేందర్ మాట్లాడుతూ అత్యవసర సమయంలో పొదుపు భరోషాగా నిలిచిందన్నారు. సంఘం సభ్యులందరి సహకారంతో రెండున్నర దశాబ్దాలుగా దిగ్విజయంగా ముందుకు సాగుతుందన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డిల సహకారంతో గ్రామంలో నూతన భవన నిర్మాణం చేపడుతామని పేర్కొన్నారు. వార్షిక సమావేశంలో సంఘం ప్రతినిధులు ఇంగోళ్ల మల్లేష్, మోర్తాల ప్రభాకర్, కుర్తాల రాజు, గాజులపాటి లక్ష్మయ్య, తానాజీ, గుజుల మైసారావు, హెమేందర్, యాదగిరి, ఉప్పమ్మ, శ్రీను, నరేష్, సంపత్, కిషన్‌రావు, అరుణ, సోంమల్లయ్య, మల్లయ్య, సుధాకర్, వేములయ్య, హరీష్ భాస్కర్, కుమార్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి గ్రామాల్లో సర్వే బృందాల పర్యటన

స్టేషన్‌ఘన్‌పూర్: రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఈనెల 16 నుంచి 20వ తేదీవరకు మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రత్యేక సర్వే బృందాలు పర్యటిస్తారని ఎంపీడీఓ విజయశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో సర్వే చేసేందుకు మండల, జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తారని తెలిపారు. ఆయా పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఆధార్‌కార్డులు, రైతుపాస్ బుక్, రేషన్‌కార్డులు తదితర సంబంధిత ఆధారాలతో సిద్ధంగా ఉండాలని ఆమె సూచించారు.

క్షేత్రస్థాయి సందర్శనలో పారదర్శకత పాటించాలి

దేవరుప్పుల: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కోసం తలపెట్టిన క్షేత్రస్థాయి సందర్శనలో సంబంధిత సిబ్బంది పారదర్శకంగా వ్యవహరించాలని ఎంపీడీఓ కె.లక్ష్మీనారాయణ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా శాఖల అనుబంధ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తుల ఆధారంగా రైతు భరోసా, రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా అర్హులను గుర్తించేందుకు నిర్దేశిత నియమావళిని పాటించాలన్నారు. సమావేశంలో వ్యవసాయ అధికారి దివ్య, రెవెన్యూ అధికారి శ్రీకాంత్, నాయబ్ తహసీల్దార్ లచ్చు నాయక్ పాల్గొన్నారు.

ముగ్గులు సంస్కృతికి ప్రతీకలు



స్టేషన్‌ఘన్‌పూర్: ముగ్గు వేస్తున్న మహిళలు



దేవరుప్పల: ప్రోత్సాహకాలు అందజేస్తున్న కృష్ణమూర్తి

స్టేషన్‌ఘన్‌పూర్: ముగ్గులు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అయ్యప్పసేవా సమితి జిల్లా బాధ్యుడు, అయ్యప్ప డిజిటల్ స్టూడియో యజమాని మొగ్దుంపురం కిషోర్‌కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అంబటి కిషన్‌రాజ్, సుమిత్ర మండలి బాధ్యులు రాపర్తి సుధాకర్, యంజాల ప్రభాకర్ అన్నారు. అయ్యప్ప డిజిటల్ స్టూడియో, లయన్స్‌క్లబ్, సుమిత్ర మండలి వారి ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లిలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా వేర్వేరుగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. మహిళలు వారి ఇళ్ల ముంగిళ్లలో వేసిన ముగ్గులను పరిశీలించి బహుమతులను అందజేశారు. శ్రీనివాస్, శరత్‌కుమార్, రాజశేఖర్, ఎండీ.దస్తగిరి, కరుణాకర్‌రెడ్డి, మధుసూదన్, సతీష్, రాజు, రమేశ్ పాల్గొన్నారు.

యువతకు ప్రోత్సాహకాలు

సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని మండల కేంద్రంలోని యువతకు పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి ప్రోత్సాహకాలు అందించారు. పలు వార్డుల్లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలకు ప్రోత్సాహకంగా పాలక్యాన్‌లు, నగదు బహుమతి అందించారు. అలాగే ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారిని సన్మానించి జ్ఞాపికలను అందించారు.

జనగామ: ముగ్గు వేస్తున్న యువతులు, మహిళలు







జనగామ: శ్రీనగర్‌కాలనీలో..



బచ్చన్నపేటలో..



ముగిసిన మల్లన్న జాతర



జాతరలో భక్తుల సందడి

దేవరుప్పుల: బంజర మల్లన్న జాతర బుధవారం ప్రశాంతంగా ముగిసింది. పెద్దమడూరుకు చెందిన జోగు బ్రదర్స్ ఆధ్వర్యంలో బోగి పండుగతో బోనాలు, సంక్రాంతితో మల్లన్న కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సైలు ఊర సృజన్‌కుమార్, పవన్‌కుమార్‌లు బందోబస్తు చేపట్టారు. కాగా, జాతర ప్రశాంతతకు తోడ్పాటు అందించిన పోలీసు యంత్రాంగానికి జోగు భిక్షపతి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా సంక్రాంతి, కనుమ పండుగ

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ప్రజలు మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ పండుగను ఘనంగా జరుపుకున్నారు. పలు గ్రామాల్లో మహిళలు నోములు నోముకొని వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. సంక్రాంతి సందర్భంగా మహిళలు ఇళ్ల ముంగిళ్లలో రంగురంగులతో ముగ్గులు వేసి వాకిళ్లను అందంగా తీర్చిదిద్దారు. ఆలయాల్లో పూజారులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. ముగ్గుల పోటీలతో మహిళలు, గాలిపటాల ఎగరవేత, క్రీడాపోటీలతో యువకులు హోరెత్తించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.



పతంగులు ఎగుర వేస్తున్న కుటుంబ సభ్యులు



జఫర్‌గఢ్‌లో..



సిద్ధేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



జఫర్‌గఢ్ తమ్మడపల్లి (జి)లో డోలు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న యాదవ కులస్తులు



తరిగొప్పల: నోములు నోముకుంటున్న మహిళలు



జనగామ: నోముకుంటున్న మహిళ

యువకవికి సన్మానం



రామును సన్మానిస్తున్న గణేష్‌యూత్ బాధ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లికి చెందిన యువకవి, ఇటీవల అగ్గిపూలు నవలను రచించి ఆవిష్కరించిన మారెడుపాక రామును గ్రామానికి చెందిన గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యూత్ బాధ్యులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన రాము కవిగా రాణించడం ఎంతో సంతోషంగా ఉందని, రానున్న రోజుల్లో మరింత ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాక్షించారు. యూత్ బాధ్యులు తోట అశోక్, రాజు, రమేష్, మహేందర్, రమేష్, నాగరాజు, రాజు, రఘు, మహేందర్, శివ, అఖిల్, రాజేష్ పాల్గొన్నారు.

యువత క్రీడలపై దృష్టి సారించాలి



జపర్‌గఢ్: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్సై రామ్‌చరణ్



బచ్చన్నపేట: బహుమతులు అందజేస్తున్న మాజీ సర్పంచ్‌లు

జఫర్‌గఢ్: యువత క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక ఎస్సై రామ్‌చరణ్ కోరారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బజ్జూరి మణికాంత్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ పోటీలను ఎస్సై ప్రారంభించి మాట్లాడారు. యువత సన్మార్గంలో పయనించాలని అన్నారు. యువతను ప్రోత్సహించేందుకు బజ్జూరి మణికాంత్ తండ్రి స్మారకార్థం పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జ్యోతి రజిత యాకయ్య, మాజీ వార్డు సభ్యులు కుక్కల సారంగం, మాతరాసి రమేశ్, సింగారపు రమేశ్, ఎం.సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

చిల్పూరు: క్రీడల్లో గెలుపోటములు సహజమని రిటైర్డ్ డీఎస్పీ గులాం సందాని, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రంగు రమేశ్‌లు అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామంలో కబడ్డీ, శ్రీపతిపల్లి గ్రామంలో వాలీబాల్ గ్రామ స్థాయి క్రీడలను మంగళవారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వారు పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. కృష్ణాజీగూడెంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ప్రథమ బహుమతి సంగి గణేష్ జట్టు రూ. 3,016, ద్వితీయ బహుమతి సాదం చందు జట్టు రూ. 2,016 నగదును గెలుచుకున్నాయి. శ్రీపతిపల్లిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో ప్రథమ బహుమతి టి.సాంబరాజు జట్టు, ద్వితీయ బహుమతి ఎస్‌కే పాషా జట్టు గెలుచుకున్నాయి.

కబడ్డీలో విజేతగా రామరాయనిబంగ్లా జట్టు

రఘునాథపల్లి: మండలగూడెంలో మద్దెల చిన్న యాదగిరి స్మారకార్థం వారి కుమారుడు కరుణాకర్ నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ క్రీడోత్సవాల ఫైనల్‌లో మండలంలోని రామరాయనిబంగ్లా జట్టు విజేతగా నిలిచింది. ప్రథమ బహుమతి రామరాయనిబంగ్లా, ద్వితీయ బహుమతి మండలగూడెం, తృతీయ బహుమతి వెల్ది జట్లు గెలుచుకున్నాయి. గెలిచిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. పుప్పాల వేణు, రజనీకాంత్, నవీన్, గ్రామ పెద్దలు ఉత్తెపు సత్యనారాయణ, సిద్దేశ్వర్ పాల్గొన్నారు.

వాలీబాల్‌లో రఘునాథపల్లి జట్టు

మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సంక్రాంతిని పురస్కరించుకొని నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో రఘునాథపల్లి జట్టు అత్యుత్తమ ప్రతిభ చాటి విజయం సాధించింది. కార్యక్రమంలో కొత్తపల్లి రాజేందర్, కడారి శ్రీనివాస్, సింగారపు కార్తీక్, చింతకింది ప్రభాకర్, బిర్రు ప్రవీణ్‌కుమార్, శాగ శ్రీనివాస్, ఎన్ తిర్మలేష్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

బచ్చన్నపేట: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు నాయకత్వ లక్షణాలు అలవడుతాయని కట్కూర్, వీఎస్ఆర్‌నగర్ గ్రామాల మాజీ సర్పంచ్‌లు మూసిని సునీత, కోనేటి స్వామి అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ఎనుగుల అరుణ్‌కుమార్ టీం ప్రథమ, మూసిని రాజు టీం ద్వితీయ, వాలీబాల్‌లో ప్రథమ మానుపాటి శ్రీహరి టీం, ద్వితీయ బహుమతి ప్రశాంత్ టీంలు గెలుచుకున్నాయి. విజేతలకు వారు బహుమతులను అందజేశారు. మూసిని బాబుగౌడ్, శ్రీశైలం, బాల్‌రాజు, కర్ణాకర్, విదేయ్, శ్రీనివాస్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు కృషి

పాలకుర్తి టౌన్: గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్ అన్నారు. మండలంలోని నలిగానతండాలో సేవాలాల్ మహారాజ్ సేనా ఆధ్వర్యంలో పాలకుర్తి నియోజకవర్గ స్థాయి కబడ్డీ క్రీడలను సేన జిల్లా అధ్యక్షుడు ధారవత్ శంకర్‌నాయక్‌తో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మదార్ వాలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు సిరికొండ విక్రమ్, తొర్రూరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పయ్యాల ప్రవీన్, సేవాలాల్ విద్యార్థి సేన జనగామ జిల్లా అధ్యక్షుడు అనిల్‌నాయక్, యువకులు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

జనగామ: జిల్లాలో సంక్రాంతి పండుగ వేళ రోడ్డు ప్రమాదాలు జరిగాయి. జిల్లా కేంద్రంలోని ఫైఓవర్‌తో పాటు ఆయా ప్రాంతాల్లో 10కి పైగా రోడ్డు ప్రమాదాలు జరగగా, 8 మందికి పైగా గాయాలయ్యాయి. జనగామ ఓవర్ బ్రిడ్జిపై ఈ నెల 14న రాత్రి కారు, బైక్ ఢీకొన్న ఘటనలో పెద్దపహాడ్‌కు చెందిన రాజేష్, దండు కాంత్, సాయికుమార్‌కు తీవ్ర గాయాలు కాగా జిల్లా ఆస్పత్రికి తరలించారు. అలాగే ఆయా ప్రాంతాల్లో యాదగిరి, వెంకటయ్య, బాలరాజు, లోకేష్, మహాకాంత్ తదితరులకు గాయాలయ్యాయి. వీరిని జిల్లా ఆస్పత్రికి తరలించగా, రెండు రోజుల పాటు చికిత్స పొందారు.

దేవరుప్పులలో..

దేవరుప్పుల: మండల కేంద్రంలోని డబుల్ బెడ్రూం ఏరియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయని ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి మండల కేంద్రంలోని చౌరస్తా నుంచి మోటార్ సైకిల్‌పై పాశం మల్లేశ్, ధరావత్ చంద్రు డబుల్‌బెడ్రూం కాలనీకి క్రాస్ అయ్యారు. ఇదే క్రమంలో వెనుకాల వస్తున్న ఇదే గ్రామానికి చెందిన తీగల ఉదయ్ బైక్‌తో ఢీకొట్టగా వారిద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి..

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు పులి యాకయ్య తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని ఛాగల్లు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఛాగల్లు చెందిన యాకయ్య గీత వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో రోజు మాదిరిగా మంగళవారం సాయంత్రం కల్లుగీసేందుకు తాటిచెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు జారిపడగా తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన తోటి గీత కార్మికులు అందించిన సమాచారం కుటుంబ సభ్యులు యాకయ్యను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఎంజీఎంలో యాకయ్య చికిత్స పొందుతున్నాడు. కాగా, తీవ్రంగా గాయపడ్డ యాకయ్యకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామ గౌడసంఘం అధ్యక్షుడు రంగు ప్రభాకర్, ఉపాధ్యక్షుడు వడ్లకొండ విజయ్, కార్యదర్శి ఎల్లయ్య, నర్సయ్య, భిక్షపతి తదితరులు కోరారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

జనగామ రూరల్: రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తే విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం ఓ ఫంక్షన్ హాల్‌లో ఖమ్మం, వరంగల్, నల్లగొండ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాలకు అతీతంగా ఉపాధ్యాయులు ఆలోచించి నిర్ణయం తీసుకొని ఒక అవకాశం తనకు ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ చలపతి రెడ్డి, శ్రవణ్‌రెడ్డి, చక్రా రెడ్డి, పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

పాలకుర్తి టౌన్/పాలకుర్తి: చెన్నూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం 1999–2000 పదో తరగతి పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగ చదువు నేర్పిన గురువులను సన్మానించారు. ఎంఈఓ నర్సయ్య, హెచ్‌ఎం రమేశ్, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.